# శ్రీకారం

"సౌ రూపియే దేదో సాబ్"

"మీటరెంతయింది?"

"మీటరు యాభై రుపాల్, పది రుపాల్ లగేజ్"

" రైల్వే స్టేషన్నుంచి ఇరవై రూపాయలకంటే ఎక్కువ కాకూడదు. యాభై రూపాయలెలా అయింది, అసలు మీటరు సరిగా పని చేస్తుందా?"

"మీటరు బరాబరున్నది. జల్ది పైసె నికాలోజీ, ఇస్కూలు పోరగండ్లను ఇడువనికి పోవాలె" గొడవెందుకని అరవై రూపాయలు ఇచ్చేశాడు జగన్.

"ఇక మీదట జాగ్రత్తగా ఉంటే సరి' అనుకున్నాడు. ఆటోవాడి పంట పండింది. పొద్దున్నే మంచి బేరం దొరికింది.

జగన్ అనబడే జగన్నాథ్, ముంబయ్ నుంచి హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో వచ్చి నాంపల్లి స్టేషన్లో దిగాడు. హైదరాబాద్‌కు కొత్త అని తెలిగ్గానే గుర్తుబట్టిన ఆటో డ్రైవర్ జగన్‌కి హైదరాబాద్ సందర్శనం చేయించి "ఇమ్లీబన్" బస్టాండ్‌లో దించాడు. ఆదిలోనే హైదరాబాద్ చురక తగిలింది జగన్‌కి. ఎంక్వైరీ కౌంటర్ వైపు నడిచాడు జగన్.

"నిర్మల్ బస్ ఎన్ని గంటలకు ఉందడీ?"

"అక్కడ అంత పెద్ద బోర్డు పెయింట్ చేసి పెట్టాం చూసుకోరాదూ? చదువొచ్చిన వాడూ, రానివాడూ అందరూ వచ్చి మా ప్రాణాలు తీస్తారు. ప్రతివాడికీ అన్నీ రెడిమేడ్‌గా కావాలి. తాము మాత్రం శ్రమ తీసుకోరు" రుస రుసలాడుతూ అన్నాడు కౌంటర్లో కూర్చుని తీరిగ్గా టిఫిన్ చేస్తున్న క్లర్కు.

'పొద్దున భార్యతో దెబ్బలాడాడు కాబోలు, ఆవిడ కాఫీ, టిఫిన్ ఇచ్చినట్టు లేదు!' అనుకున్నాడు జగన్.

టిఫిన్ చూడగానే ఆకలి తెలిసి వచ్చింది. క్రితం రాత్రి రైల్లో సరిగ్గా భోజనం చేయలేదు. క్యాంటీన్ వైపు నడిచాడు జగన్.

టిఫిన్ చేస్తూ ఎదురుగా కూర్చున్నతనితో..

"ఏమండీ నిర్మల్ బస్సులిప్పుడుంటాయా? అవి ఎక్కడి నుండి బయలుదేరుతాయి?"

"ప్రతి అరగంటకో బస్సుంటుంది బాబూ. ప్లాట్‌ఫాం నెంబరు అక్కడ బోర్డు చూస్తే తెలుస్తుంది."

'ఈయన కూడా బోర్డు గురించే మాట్లాడుతున్నాడు బాబోయ్' అనుకుంటూ నిట్టూర్చాడు జగన్.

నిజానికి జగన్ ఆ బోర్డును చూశాడు. తను బి.కామ్. సెకండియర్ చదువుతున్నా, ఆ బోర్డును మాత్రం చదవలేకపోయాడు. అది తెలుగులో ఉంది!

"ఎక్కడి నుండి వస్తున్నావు బాబూ? నిర్మల్‌లో చుట్టాలున్నారా?"

'ఈ వివరాలన్నీ ఈయనకెందుకో?'అని విసుక్కున్నాడు జగన్, మనసులో మొహమాటానికి జవాబు చెప్పాడు.

"బొంబాయి నుండి ఉదయమే దిగానండీ. నిజామాబాద్ జిల్లాలోని మా ఊళ్ళో బాబాయి కూతురి పెళ్ళి ఉంది."

"నిజామాబాద్ వెళ్ళడానికి హైదరాబాద్ ఎందుకు వచ్చావు నాయనా? అయినా నిర్మల్ అన్నావు, అది ఆదిలాబాద్ జిల్లా కదా?"

'ఇదెక్కడి పీడరా బాబూ! ఈయన రిటైర్డ్ బడిపంతులులా ఉన్నాడు. తేనె తుట్టెను కదిపినట్టయిం'దని వాపోయాడు జగన్.

రోట్లో తల పెట్టిం తర్వాత పోటు తప్పదు కదా!

"బొంబాయి నుండి 'నాందేడ్' నుండి 'ముద్‌ఖేడ్', అక్కడి నుండి నిజామాబాద్ అలా మూడు రైళ్ళు మారాలి. మళ్ళీ మా ఊరికి రెండు బస్సులు మారాలి. కొంత చుట్టయినా సుఖంగా ఉంటుందని హైదరాబాద్ వచ్చానండీ. మా ఊరు ఉన్నది నిజామాబాద్ జిల్లాలోనే నిర్మల్ రూటులో ఉంది. సరే, వస్తానండీ! నమస్కారం" అని గబగబా టీ తాగి లేచాడు జగన్, ఇంకా కూర్చుంటే ఏ ప్రమాదం ముంచుకువస్తుందోనని భయపడి!

బస్టాండ్ ప్లాట్‌ఫారాలపై చూస్తే! షరా మామూలే! అంతా అయోమయం! అన్ని బోర్డులూ తెలుగులోనే. బస్సులపై కూడా తెలుగులోనే బోర్డులు!

ఎవరినన్నా అడగాలంటే నామోషీ! కానీ తప్పదు. అవసరం తనది!

"నిర్మల్ వెళ్ళే బస్సు ఏ ప్లాట్‌ఫాంపై వస్తుందండీ?" లాల్చీ, ధోవతి, కండువా పెద్దమనిషి తరహాలో ఉన్నతన్ని అడిగాడు జగన్.

ఆయన కళ్ళద్దాల్లోంచి ఎగాదిగా చూసి, దగ్గర్లోని ప్లాట్‌ఫాం వైపు చేయి చూపించాడు.

జగన్ అటువైపు కదిలాడు.

పది నిమిషాలయింది. ప్లాట్‌ఫాంలో రెండు బస్సులు వచ్చి వెళ్ళాయి.

మరో పది నిమిషాల తర్వాత జగన్ ఉన్న ప్లాట్‌ఫాంపై ఓ బస్సు వచ్చి ఆగింది.

"ఇది ఏ ఊరు బస్సండీ?" దిగుతున్న కండక్టర్ని అడిగాడు.

"ఆదిలాబాద్"

జగన్ ప్లాట్‌ఫాం పైకి తిరిగి వచ్చాడు. పదిహేను నిమిషాలు గడిచాయి. జగన్‌కి అసహనంగా ఉంది. తనతో పాటు టిక్కెట్ బుక్ చేసి ఆఖరి నిమిషంలో క్యాన్సిల్ చేసిన డాడీపై కోపంగా ఉంది. ఒక్కడినే ఊరు వెళ్ళనని ఎంత మొత్తుకున్నా వినని మమ్మీపై కినుకగా ఉంది. ఎంతకూ రాని 'నిర్మల్' బస్సుపై మంటగా ఉంది.

"అరగంటకో బస్సు ఉందంటున్నారు. నేను వచ్చి నలభై నిమిషాలయింది, నిర్మల్ బస్సు రాలేదు. ఇంతలో వస్తుందంటారా?" అడిగాడు జగన్, తన పక్కనున్నతన్ని.

"అదేంటి సార్, అరగంట క్రితం ఆ పక్క ప్లాట్‌ఫాం నుండి రెండు 'నిర్మల్' బస్సులు వెళ్ళాయి. ఇంతకు ముందు ఇక్కడి నుండి వెళ్ళిన 'ఆదిలాబాద్' బస్సు కూడా 'వయా నిర్మల్' అని రాశారు. చూడలేదా?" అన్నాడతను.

ఏమంటాడు పాపం! కుక్కిన పేనులా కిక్కురుమనలేదు జగన్.

"అదిగోండి సార్, మీరెళ్ళాల్సిన 'నిర్మల్' బస్సు వచ్చింది."

వడి వడిగా బస్సు వైపు నడిచాడు జగన్.

అదృష్టవశాత్తు కిటికీ పక్క సీటు దొరికింది. బస్సు అంత రద్దీగా లేదు. 'ముస్కాల్'కు టిక్కెట్టు తీసుకుని, ఆ ఊరు రాగానే చెప్పమన్నాడు.

బస్సు సిటీ లిమిట్స్ దాటి, మేడ్చల్ మీదుగా తూప్రాన్ వైపు వెళ్తోంది.

పచ్చని పొలాలు, కాలుష్యం లేని గాలి, ఎంతో హాయిగా ఉంది జగన్‌కు. నవంబర్ నెల, ఎండ అంత తీవ్రంగా లేదు. కాంక్రీట్ జంగల్‌గా మారిన బొంబాయిలో పుట్టి పెరిగిన జగన్‌కు, చెట్లు, పైర్లతో సస్యశ్యామలంగా ఉన్న ఈ పరిసరాలు, అహ్లాదకరమైన వాతావరణం రిఫ్రెషింగా ఉన్నాయి. ఇంతకు ముందు కొన్నిసార్లు ఊరుకెళ్ళినా, కుటుంబ సభ్యులతో బాతాఖానీతో ఈ ప్రయాణం గడిచిపోయేది. ఇలా తీరుబడిగా ప్రకృతిని గమనించే అవకాశం కలగలేదు. రామాయంపేటలో మళ్ళీ టీ, టిఫిన్ తీసుకున్నాడు. కామారెడ్డిలో ఖాళీ అయిన జగన్ పక్క సీటులో ఓ పల్లెటూరి శాల్తీ వచ్చి భర్తీ చేశాడు.

ఆర్మూర్ వైపు సాగుతోంది బస్సు. దినపత్రిక తీశాడు జగన్ పక్కనున్నతను. పేపర్ చూడగానే, క్రితం రోజు జరిగిన ఇండియా-శ్రీలంక వన్‌డే రిజల్ట్ తెలుసుకోవాలని కుతూహలం కలిగింది జగన్‌కు.

అదే అడిగాడు పక్కాయన్ని. ఆయన స్పోర్ట్సు పేజీ తీసిచ్చాడు. బొమ్మలు చూడసాగాడు జగన్. సచిన్, అర్జున్ రణతుంగ, ఇద్దరి ఫోటోలూ ఇచ్చారు. 'ఎవరు గెలిచారో' చదివితే గానీ తెలీదు. కానీ చదివేదెలా? ఇప్పుడు తన తెలుగురాని తనంపై కోపం వచ్చింది. సిగ్గు విడిచి పక్కాయన్ని అడిగాడు. అతడు వింతగా చూశాడు.

'డ్రెస్సు చూస్తే టిప్‌టాప్‌గా ఉంది. కాని తెలుగు కూడా చదవడం రాదు. ఏం మనిషో?' అనుకున్న భావం కనబడింది జగన్‌కు అతని కళ్ళల్లో. ఇండియా గెలిచిందని మాత్రం తెలిసింది.

"వేషం చూస్తే కాలేజీ కుర్రాడనుకోవాలి. జీన్సు, టీ షర్టు, కాళ్ళకు బూట్లు, కళ్ళకు గాగుల్స్. నాలుక్కోస్తే అక్షరం ముక్క రానట్టుంది. పులిని చూసి, నక్క వాతలు పెట్టుకోవడం అంటే ఇదే. విద్య లేని వాడు వింత పశువని ఊరికే అన్నారా?" అని మెల్లిగా అన్న మాటలు వెనక నుండి వినిపించాయి.

అవి తనను ఉద్దేశించి అన్నవే అని ఖాయపర్చుకున్నాడు జగన్. గిరుక్కున వెనక్కి తిరిగి....

"ఏమండీ, నేను వింత పశువునా? నాలుక్కోస్తే అక్షరమ్ముక్క రాదా? జస్ట్ బికాస్ ఐ ఆస్క్‌డ్ ఫర్ సమ్ ఇన్ఫర్‌మేషన్ ఫ్రం దిస్ గై, యూ హావ్ నో బిజినెస్ టు ఇన్సల్ట్ మి. డూ యూనో దట్ ఐ యామ్ ఎ బి.కామ్. స్టూడెంట్ ఇన్ బాంబే అండ్ హావ్ స్టడీడ్ ఇన్ ఇంగ్లీష్ మీడియం థ్రూ ఔట్? ఆఫ్టరాల్ యూ మేనో తెలుగు. బట్ మై ఇంగ్లీష్ ఈజ్ మచ్ బెటర్. బోడి తెలుగు చదవడం రాకపోయినంత మాత్రాన అంతలేసి మాటలంటారా?" జగన్ ఉక్రోషం ఆపుకోలేకపోయాడు.

"సారీ, మై సన్. యువర్ ఇంగ్లీష్ మే బీ బెటర్ దాన్ మై తెలుగు. ఐ ఎట్‌లీస్ట్ నో మై మదర్ టంగ్. యూ, ఆల్సో ఎ బోడి తెలుగు యంగ్ మ్యాన్, డోంట్ నోదట్, ఇన్ ఆంధ్ర యూ హావ్ టు నో తెలుగు అండ్ టు దట్ ఎక్స్టెంట్ యూ ఆర్ ఇల్లిటరేట్.

గొడవెందుకు గానీ, రాబోయేదే ముస్కాల్, నీవు దిగాల్సిన ఊరు. తర్వాతెప్పుడైనా తీరిగ్గ మాట్లాడదాం" పల్లెటూరు బైతులా ఉన్న ఆయన ఇంగ్లీషు ధాటికి అవాక్కయ్యాడు జగన్ తగిన జవాబిద్దామని నోటి దాకా వచ్చింది, కానీ అప్పటికే స్టాండ్‌లో ఆగింది బస్సు.

ఆ పెద్దాయన్ని కొరకొరా చూస్తూ బస్సు దిగాడు జగన్. ఆటోస్టాండు వైపు అడుగులు వేశాడు. ఆ కోపంలో బేరం కూడా చేయకుండా ఓ ఆటోలో కూర్చుని 'నాగంపేట పోనీయమన్నాడు.

నాగంపేటలో తమ ఇల్లును దూరం నుంచి చూడగానే మనసు ఉల్లాసభరితమైంది బస్సులోని సంఘటన మరుగున పడింది. ఆటో ఆగగానే, బాబాయి, పిన్ని, బంధువులు పిల్లలు చుట్టుముట్టారు.

"నాన్న గారేరీ?" అడిగాడు బాబాయి.

"తనకు అర్జెంటుగా ఢిల్లీ వెళ్ళాల్సి వచ్చింది. ఏదో సెమినారట. అందుకని ఒక్కడినే వచ్చాను."

బాబాయ్ కళ్ళల్లో నిరాశ కన్పించినా, తనైనా వచ్చినందుకు ఆనందపడ్డాడు.

స్నానం, అన్నపానాదులు కానిచ్చి, రెస్టు తీసుకున్నాడు జగన్.

పెళ్ళి కళ వచ్చింది ఇంటికి. పెయింట్ వేశారు. వాకిట్లో పెద్ద షామియానా పచ్చనిమామిడి ఆకుల పందిరి. ద్వారాలకు తోరణాలు. వచ్చిన బంధుమిత్రులతో కళకళలాడుతున్నాయి ఇల్లు, చుట్టూ పరిసరాలు.

అంతమంది బంధువులను ఒక్కచోట కలుసుకునే అవకాశం కలిగినందుకు ఆనందంగా ఉంది జగన్‌కు. అబ్బాయీ, అల్లుడా, మనవడా, అన్నా, తమ్మి, బావా, ఇలా రకరకాల వరసలతో తనను పలకరిస్తున్నారు బంధువులు. కొందరితో అస్సలు పరిచయం లేదు. అయినా అందరికీ ఓపిగ్గా సమాధానాలు చెబుతూ వాళ్ళ బాగోగులు కూడా అడిగాడు వారితో మనసు విప్పి మాట్లాడాడు.

అమెరికా బాబాయి, వాళ్ళబ్బాయి క్రిస్ - క్రిష్ణమోహన్ కూడా వచ్చారు పెళ్ళికి వాళ్ళను దాదాపు పదేళ్ళ తర్వాత కలిశాడు. క్రిస్ జగన్ ఈడు వాడే. అమెరికాలో పుట్టి పెరిగాడు. తనకు మంచి కంపెనీ దొరికిందని అనందపడ్డాడు జగన్.

పెళ్ళి వైభవంగా, కోలాహలంగా ఏ అపశ్రుతులు లేకుండా జరిగింది. వరుని ఊరు కూడా వెళ్ళి వచ్చారు జగన్, క్రిస్‌లు. పెళ్ళి సంబరంలో నాలుగు రోజులు నాలుగు నిమిషాల్లా గడిచాయి.

మరుసటి రోజే జగన్ బొంబాయి ప్రయాణం. టీ, టిఫిన్లు చేసి వాకిట్లో మంచం మీద కూర్చున్నారు జగన్, క్రిస్‌లు. పక్కింటి బామ్మ ఓ ఉత్తరం చదవి పెట్టమని జగన్ కిచ్చింది. జగన్ తెల్లమొహం వేశాడు. క్రిస్ జగన్ ఇబ్బందిని అర్థం చేసుకున్నాడు. అతని చేతి నుండి ఉత్తరం తీసుకుని చదవ సాగాడు. జగన్ ఆశ్చర్య పోయాడు. ఎన్నో తెలుగు

స్కూళ్ళున్న బొంబాయిలో తను తెలుగు నేర్చుకోలేదు. అమెరికాలో పుట్టి పెరిగిన క్రిస్ తెలుగెలా నేర్చుకున్నాడు? అదే అడిగాడు బామ్మగారు వెళ్ళిపోగానే. క్రిస్ చెప్పిందాన్ని విని అబ్బుర పడ్డాడు.

" అమెరికా తెలుగు సంఘం వారు ఉద్యోగం నుంచి రిటైరైన ఓ తెలుగు పండితున్ని ఇండియా నుంచి అమెరికా రప్పించుకున్నారు. ఆయనకు భోజనం, వసతీ కాక జీతం కూడా ఇచ్చి, తమ సభ్యుల పిల్లలకు మన భాష సంస్కృతి, ఒంటబట్టిస్తున్నారు. శని, ఆదివారాలు వెకేషన్లలో తెలుగు క్లాసులు నడుపుతున్నారు."

"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" మాత, మాతృభూమి స్వర్గం కంటే గొప్పనైనవి. అలాగే మాతృభాష కూడా గొప్పది. దాని ద్వారానే మన మూలాలు తెలుసుకోవచ్చు. ఏ దేశం వెళ్ళినా, ఎంత పెద్ద పదవిలో ఉన్నా మన భాషను, వారసత్వాన్ని, మరువకూడదు" అమెరికా బాబాయ్ పిల్లలకు బోధ చేశాడు.

జగన్‌కు తన తల్లిదండ్రుల మాటలు జ్ఞప్తికి వచ్చాయి. వారూ ఇదే అన్నారు. కాని తను లక్ష్య పెట్టలేదు. వెకేషన్లో తెలుగు క్లాసులకు వెళ్ళమన్నారు. తను వింటేగా? తెలుగు మాట్లాడటం వచ్చు కదా! భాషతో పని ఏమిటి? దాని అవసరం ఉండదు అనుకున్నాడు. ఉద్యోగానికి తెలుగు అవసరం లేకపోవచ్చు కాని సామాజికంగా ఆ అవసరం ఉంది. ఎంత ఇంగ్లీషు నేర్చినా, ఇతర భాషలు వచ్చినా, తెలుగు భాష ప్రభావం వేరు. తమ భాషలోనే తమ ఆత్మ ప్రస్ఫుటం అవుతుంది. దాంట్లో ఉన్న ఆత్మీయత ఇతర భాషల్లో లేదు. మన భాష, మన సంస్కృతి యొక్క విలువ ఈ ప్రయాణంలో కొట్టవచ్చినట్టు తెలిసివచ్చాయి. తను ఎలాగైనా తెలుగు రాయడం, చదవడం నేర్చుకోవాలని నిశ్చయించుకున్నాడు జగన్. తమ ఇంట్లోని పుస్తకాలు చదివి వాటిలోని అపార జ్ఞానాన్ని ఒంటబట్టించుకోవాలని తీర్మానించుకున్నాడు. ఆ రోజు సాయంత్రం ముస్కాల్ వెళ్ళి పెద్ద బాలశిక్ష, ఇంగ్లీషు - తెలుగు స్వబోధిని, వేమన, సుమతి శతకాలు, మూడవ తరగతి వరకు తెలుగు వాచకాలు, తెలుగు కాపీ రైటింగ్ పుస్తకాలు కొని తెచ్చుకున్నాడు.

పెద్ద బాబాయితో 'అ - ఆ'లు పెట్టించుకుని తెలుగు నుడికారం నేర్చుకోవడానికి శ్రీకారం చుట్టాడు బి. కామ్. చదువుతున్న జగన్!

మర్నాడు.....

ఉదయభానుని లేత కిరణాలు లోకంపై ప్రసరిస్తున్నాయి. ఊరు మేల్కొంది.

జగన్ బొంబాయికి ప్రయాణమయ్యాడు. అతను వెలుగును చూస్తున్నాడు. తాను మళ్ళీ ఊరికి వచ్చినపుడు చేతిలో తెలుగు పత్రిక ఉంటుంది!

బెటర్ లేట్ దాన్ నెవర్!

జాగైనా జాగృతే!

★